సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 103 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం | 13.08.2025



## రేణుక ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

4 లో



### వారి టార్గెట్..

# డెస్కేనా!

- గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో 'రాజకీయం'
- నాన్‌లోకల్ పేరుతో సభ్యత్వాల ఫ్రీజ్ సరైదేనా!

2 లో..



## రోడ్డు మరమ్మతు కోసం నిరసన

3 లో




## ప్రజలంతా జాగ్రత్తలు పాటించాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా

4 లో

## ఊపిరి పోయాక కొడుకొచ్చాడు

'మన చౌరాస్తా' కథనానికి స్పందన


మన చౌరాస్తా 12.08.2025 Mana Chourasta 2

కొన ఊపిరితో కోమాలో తండ్రి..

తనకేం సంబంధం లేదంటున్న కొడుకు..

4 లో



ప్రెస్ గబ్బు-2

## వారి టార్గెట్..
# డెస్కేనా!

- గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో 'రాజకీయం'
- నాన్‌లోకల్ పేరుతో సభ్యత్వాల ఫ్రీజ్ సరైదేనా!

**వంట మాస్టర్ పరివారం లేకుండా పని మొత్తంగా పరిపూర్ణం చేయలేడు.. ఎక్కడివారక్కడ సహకారం అందించకుండా అడుగుకూడా ముందుకు వెయ్యలేడు. ఘుమఘుమల వంటకం పొయ్యి నుంచి దిగుతుందంటే మాస్టర్ కు సహాయకులు.. సహాయకులు మాస్టర్ ఒకరికొకరు, ఒకరితో ఒకరు పరస్పర సహకారం.. సమన్వయంతోనే సాధ్యం. ఇది కేవలం ఒక్క వంట విషయమో.. మరే సందర్భానికే పరిమితమైనదే కాదు. ప్రతి దాంట్లో ఎవరి శక్తిమేరా వారు, ఎవరి అవసరం మేరా వారు చేతికి పనికల్పించి శ్రమిస్తేనే సంపూర్ణమైనా.. పరిపూర్ణమైనా.. మరే నిండుదనమైనా సాధ్యం. ఓ వార్త విషయంలో కూడా నెట్ వర్క్ టీం, డెస్క్ బృందం కలిస్తేనే దానికి పరిపూర్ణత వస్తుంది.**

(ఉప్పలంచి నరేందర్, మన చౌరాస్తా)

వార్త సేకరణకు, వార్త మలిచే తీరుకు కూడా ఒకరికొకరు సహకరించుకుంటేనే పాఠకుడికి వండి వడ్డించే రుచికరమైన వార్త అందుబాటులోకి వస్తుంది. సేకరణలో నెట్ వర్క్ టీం, మలిచే పనిలో డెస్క్.. రెండు దేనికదే.., దేని పనితీరు దానిదే. ముడి సరుకును తేవడానికి క్షేత్రస్థాయిలోని వారు ఎంతగా శ్రమిస్తారో.. మలిచేందుకు డెస్క్ లో నలిగిపోతారు. ఇక్కడ ఎండకనక, వాననక, చలనక.. కాళ్లకు పని చెబుతూ ఎన్నో ఇబ్బందులు పడి వార్త సేకరణకు వెళ్లిన వారు ఎక్కువేం కాదు.., నాలుగ్గోడల నడుమ కూర్చుని వచ్చిన ముడి సరుకును 'ఫెయిర్' గా మార్చే టీం సభ్యులు తక్కువేం కాదు. ఆ మాటకొస్తే నెట్ వర్క్ టీం ను ఎక్కువగా చూస్తూ.. డెస్క్ అంటేనే ఓ హేయమైన, చులకన భావంతో ట్రీట్ చేసే సంప్రదాయం విస్తరించడమే అత్యంత దౌర్భాగ్యం. అందునా మేధావులుగా పరిగణింపబడుతున్న వారే ఇలాంటి వింత సంస్కృతికి తెరలు తీయడమే బాధాకరం..

### అంత చిన్నచూపా..?

డెస్క్.. అంటే ఇప్పుడు వివక్షే. ఇప్పుడే కాదు.. మొదటి నుంచి అదే తీరు. ఆ మాటకొస్తే తెలంగాణ రాష్ట్రావిర్భావం తర్వాత వరకూ వారికి గుర్తింపు విషయంలో దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన దుస్థితే. నిజానికి జర్నలిజంలో పూర్తి మెలకువలు తెలుసుకుని, వార్త కూర్పునకు సంబంధించిన తర్ఫీదు తీసుకుని, బాహ్య ప్రపంచానికి విడుదలయ్యే నిజప్రతికి కర్త, కర్మ, క్రియగా బాధ్యతవహించే బరువులు మోస్తామనే హామీతోనే డెస్క్ లోకి ఎంటర్ అవుతారు. అంతటి గౌరవప్రదమైన హోదాను మండల కేంద్రాల్లోనే కాదు.., రాష్ట్ర స్థాయిల్లో పెద్దపెద్ద హోదాల్లో పదవులు వెలగబెడుతున్నారు వారు. ఆ మాటకొస్తే ప్రెస్ అకాడమీలో గౌరవప్రదమైన స్థానంలో ఉన్న వారు కూడా చిన్నబుచ్చేలా వ్యవహరించడం ఏమనుకోవాలి. తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ గా అల్లం నారాయణ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రత్యేకంగా డెస్క్ జర్నలిస్టులు అనే పదాన్ని అక్రెడిటేషన్ గుర్తింపు దక్కిందంటే వారి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అరవై ఏళ్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో డెస్క్ అంటేనే నడిరేయిలో అక్షరాలతో సమరం




చేయడం తప్ప, నలుగురిలో గుర్తింపు లేకుండా సాగిన నిషాచర జీవన విధాన విధానమే. ఎవరికైనా అక్రెడిటేషన్ ఇచ్చారంటే నెట్ వర్క్ టీంలో ప్రభుత్వ ఉద్యోగులో, ఇతరత్ర కారణాలతో ఖాళీగా ఉన్న డెట్ లైన్లకు సంబంధించి మాత్రమే సాధ్యమయ్యేది. అలాంటి వాతావరణానికి, ఆ చెడ్డ సంప్రదాయానికి తొల రాష్ట్ర ప్రభుత్వంలో అల్లం సార్ తెరతీయడం సంతోషించదగ్గ విషయం. తాజాగా రాష్ట్ర వాప్తంగా ఇప్పుడున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి కూడా డెస్క్ వాళ్లకు అక్రెడిటేషన్లు అవసరమా.. అనే ధోరణికి అంకురార్పణ చేస్తారనే ఆలోచనలు ఆందోళన కలిగించేవే.. వాటి పర్యావసనం.. భవిష్యత్ లో ఎలాంటి దారులకు అవకాశం కల్పిస్తుందో వేచిచూడాలి.

### ఓట్లకు ఓకే.. కానీ..

**వరంగల్ ప్రెస్ క్లబ్ వేదికగా జరుగుతున్న రాజకీయాలు కూడా అక్రెడిటేషన్ విషయంలో పక్కనబెడ్దాం, క్లబ్ సభ్యత్వాల పునరుద్ధరణ, డెస్క్ మిత్రులకు ఇచ్చే కనీస గౌరవాల్లో కూడా ఆశ్చర్యగొలిపే సంప్రదాయాలు కనిపిస్తున్నాయి. పనిలో భాగంగా, వృత్తి ధర్మంలో భాగస్వాములుగా డెస్క్ మిత్రులు ఉమ్మడి జిల్లా కేంద్రమైన కార్యాలయాల్లో కాకుండా తలోదిక్కు విసిరేసినట్టుగా మారారు. ప్రభుత్వ పెద్దలు ఒక్క జిల్లాను ఖండఖండాలుగా మార్చగా లేని తలనొప్పి, ప్రెస్ క్లబ్ బాధ్యులకు మాత్రం పెద్ద చిక్కుగా మారినట్టు ఫీల్ అవుతున్నారు.**

**జీతాలిచ్చే సంస్థలు అభ్యంతరాలు పెట్టడం లేదుగానీ, క్లబ్ సభ్యత్వాల విషయంలో మాత్రం కార్యవర్గం కొర్రీలు పెట్టడానికి తెర తీయడం ఏమనుకోవాలి..? ఓట్ల నాడు అక్కరకొచ్చినోళ్లు, రాష్ట్ర వ్యాప్తంగా ఆ చివర, ఈ చివర నుంచి మన కార్యవర్గాన్ని మనం ఎన్నుకోవాలనే ఆత్రుతతో అపసోపాలు పడుతూ క్లబ్ కు పరుగెత్తుకుంటూ వచ్చిన వారు ఇప్పుడు ఎటూ కొరగాకుండా పోతున్నారు. దశాబ్దాలుగా క్లబ్ ను తల్లిగా.., సాటి జర్నలిస్టులను సోదరసమానులుగా ఎన్నో ఎన్నెన్నో బంధాలను పెనవేసుకున్న డెస్క్ జర్నలిజం దేహీ అనాల్సిన అట్టడుగుకు దిగజారుస్తున్నారు.**

### కాళ్లు ఇరగ్గొట్టుడే కర్తవ్యమా..?

ఆవులావులు కొట్లాడుకుని లేగల కాళ్లు విరగొట్టినట్టు యూనియన్ పెద్దలు, యూనియన్ల బాధ్యులు కయ్యానికి కాళ్లు దువ్వుకుంటూ డెస్క్ అనే వారిని పరాయిగా, ఆ మాటకొస్తే అంటరాని వారిగా పరిగణించాలని పోటీపడడం ఎంత వరకు సమంజసం. సభ్యత్వాలు వాళ్లకు కావాల్సిస్తే పెంచడం, అవసరం లేకుండా తగ్గించడం, స్వచ్ఛమైన వారు వాళ్లకు అనుకూలురైతే ఒకే, వారికి నచ్చకపోతే శీలత లేనివారిగా ముద్ర వేయడం.. ఈ వింత పోకడంతా విపరీత పరిణామాలకు దారితీస్తుందే తప్ప మరేమి కాదు. ఇవ్వాళ ఆ స్థాయిలో ఉన్నవారంతా రేప్పొద్దున అక్కడే అదే స్థానాల్లో ఉంటారనే గ్యారంటీ ఉందా.. ఆ బాపతు వాళ్లే సెలవియ్యాలి. అంతేకాకుండా నాడు డెస్క్ ల్లో చేరిన మిత్రులంతా వారు చేరేటప్పుడు ఇప్పుడున్న వాళ్లంతా ఎక్కడున్నారో కూడా గుర్తు చేసుకోవాలి.

### గుర్తింపు కాదు.. గమనించాల్సిందే..

బరువైన సరే బాధ్యతను దించకుండా మోయాలనుకునే వారే నిబద్ధత ఉన్నవారుగా పరిగణింపబడుతారు. శతాబ్దాలుగా వర్థిల్లుతున్న జర్నలిజంలో కొత్తపుంతలు తొక్కుతున్న వార్త సేకరణ ట్రెండ్ నడుస్తోంది. ఎన్ని ప్రత్యేకతలు సంతరించుకున్నా.. ఎన్ని కొత్త కోణాలు ఆవిష్కృతం అయినా అంతిమంగా ఫెయిర్ కాపీ బయటకు రావాలంటే డెస్క్ బలంగా ఉండాల్సిందే. అంతటి కీలకమైన ఒక శాఖను బలహీనం చేయడానికి, బలవంతంగా బలాన్ని లాగేయడానికి వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రస్తుత కార్యవర్గం ప్రయత్నాలు చేయడం, సభ్యత్వాల సుప్తచేతనావస్థ (ఫ్రీజ్)లో పెట్టాలనే ఆలోచనతో కనీస గుర్తింపును ఇవ్వడానికి దాటవేత ధోరణికి శ్రీకారం చుట్టిన విధానం ఎంత మాత్రం సరైనది కాదు. వీళ్లు బాధ్యతలు స్వీకరించే వేళ తోడ్పాటు అందించిన డెస్క్ ఇప్పుడు స్థానికంగా లేరనే కారణంతో క్లబ్ కు దూరం చేయాలని దురాలోచనకు ఫుల్ స్టాప్ పెట్టకుంటే ఎవరిగతేమవుతుందో గుర్తెరగాలి. ఆ మాటకొస్తే ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా., డిజిటల్ మీడిగా, ఆన్ లైన్ మీడియా.. ఇలా మీడియా కొత్త పుంతలు తొక్కుతుందంటే అన్నింట్లో ఉండేది అదే జర్నలిజం ఫ్లేవర్ తప్ప మరేమీ కాదు. అందులో ఏ ఒక్కటి ఎక్కువ కాదు, ఏ ఒక్కటి తక్కువ కాదు. గుండెలమీద చెయ్యేసుకుని చెప్పాలంటే అన్నీ దేని ప్రత్యేక అది సంతరించుకున్నదే. ఎక్కడికెళ్లినా ఎక్కడ నుంచి వచ్చావనే అడుగుతారు కానీ, ఎవరు మీరు అని ప్రత్యేకంగా అడగరు. వరంగల్ నుంచి వచ్చామని గర్వంగా చెప్పుకునే డెస్క్ జర్నలిజాన్ని గుండెలు అవిశిపోయేలా చేయకుండా గౌరవంగా స్థానాన్ని కాపాడేందుకు చొరవ తీసుకోవాలి. సభ్యత్వాల రిన్యూవల్స్ కావొచ్చు, రాబోయే ఎన్నికల్లో గెలుపోటముల్లో తట్టుకుని నిలబడడానికి కావొచ్చు, ఒక వర్గాన్ని సాగనంపాలనే వింత పోకడైనా అయ్యుండొచ్చు, కొందరికి గెలుపు దక్కకుండా చూడాలనే అత్యాశతోనైనా కావొచ్చు.. కారణమేదైతేనేం డెస్క్ ను, అందునా స్థానికంగా లేరనే ఒకే ఒక కారణంతో దూరం చేయాలని చూడడం 'కొరవితో తలగోక్కోవడమే' తప్ప మరేమీ కాదు.. పర్యావసనాలు ఎంతగా ఉంటాయో పౌరషానికి కేరాఫ్ అయిన ఓరుగల్లులో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అనవసరపు ఆందోళనకు తావివ్వకుండా సమస్తాన్ని పరిగణిస్తూ, మధ్యలో చొరబడుతున్న వారికి, స్వచ్ఛత గానీ కల్తీగాళ్లను ఏరిపారేసే పనిలో నిమగ్నమైతే బావుంటుందిగానీ, శిక్షణ పూర్తి చేసుకుని, ఉద్యోగ ధర్మం నిర్వర్తించే వారికి కోత పెట్టాలనుకోవడం మానేస్తే బాగుంటుంది. చరిత్రలో ఉంటారో.. చరిత్ర హీనులవుతారో ఆలోచించుకోవాల్సింది కార్యవర్గమే..!



# నాణ్యమైన ఆహారం అందించాలి

## బీసీ సంక్షేమ శాఖ జేడీ చంద్రశేఖర్

**జనగామ, మన చౌరాస్తా :** సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం ఆయన జనగామ జిల్లాలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులతో కలిసి పర్యటించారు. జిల్లాలోని మహాత్మ జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ స్కూల్ తో పాటు బీసీ బాలికల వసతి గృహం, బీసీ బాలుర కళాశాల వసతి గృహం, మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ కళాశాల లను సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహాలను సందర్శించి విద్యార్థుల భోజనం కోసం వినియోగిస్తున్న ఆహార సామాగ్రి నాణ్యతను స్వయంగా పరిశీలించారు. మెనూ ప్రకారంగా భోజనం వండి విద్యార్థులకు పెట్టాలని నిర్వాహకులకు తెలియజేశారు. వసతి గృహాల పరిసరాలను పరిశీలిస్తూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ సిబ్బందిని ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంచాలన్నారు. ఆయన వెంట బీసీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్, ఇతర అధికారులు ఉన్నారు.



# ఫర్టిలైజర్ అమ్మకాలు క్రమబద్ధంగా జరగాలి

- వ్యవసాయ శాఖ అధికారులు దృష్టి పెట్టాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** ఫర్టిలైజర్ దుకాణాల్లో అమ్మకాలు క్రమబద్ధంగా జరగాలని జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టర్ రఘునాథపల్లి మండల కేంద్రంలోని ఎరువుల విక్రయాలను స్వయంగా పరిశీలించేందుకు సంబంధిత వ్యవసాయ శాఖ అధికారిణి అంబికా సోనితో కలిసి ఆగ్రోస్, శ్రీలక్ష్మి షాపులను తనిఖీ చేశారు. ముందుగా ఆయా షాపుల ముందు ఏర్పాటు చేసిన బోర్డ్ లను పరిశీలిస్తూ దానిపై ఉన్న వివరాలను సదరు రిజిస్టర్ లో నమోదైన విక్రయాల వివరాలను సరిపోల్చి చూశారు. ఈ సందర్భంగా వ్యాపారులకు సూచిస్తూ ఎరువుల విక్రయాలలో రైతుల పేరు, సెల్ నెంబరు, గ్రామం, మండలం, సాగు భూమి వివరాలు నమోదు చేయాలన్నారు. అలాగే ఇప్పటి వరకు జరిపిన విక్రయాలను పరిశీలిస్తూ, ఉన్న స్టాక్ వివరాలను రిజిస్టర్ లో చూపించాలన్నారు. రైతులకు యూరియా విక్రయించే ముందు సాగు చేస్తున్న భూమి వివరాలను తప్పనిసరిగా అడిగి తెలుసుకుంటూ, అందుకు అనుగుణంగా యూరియా విక్రయాలు జరగాలన్నారు. ఇష్టారీతిన విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులకు సూచిస్తూ యూరియా సమృద్ధిగా ఉందని రైతులకు తెలియ జెప్పాలన్నారు. కలెక్టర్ వెంట వ్యవసాయ శాఖ ఏఓ, ఏఈఓ, అధికారులు ఉన్నారు.

### క్రీడలపై ఆసక్తి చూపాలి...

రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్ లో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని నిర్వహణ తీరును మంగళవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా పరిశీలించారు. ముందుగా స్టోర్ రూమ్ ను సందర్శించి నిల్వ చేసిన వంటి సామగ్రితో పాటు, కూరగాయలును పరిశీలించారు. వంట గదిని ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని నిర్వాహకులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యతో పాటు క్రీడల్లో పాల్గొనడం మానసిక ఉల్లాసం కలుగుతుందని, తద్వారా ఆలోచన శక్తి పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు. భోజన వసతిని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట రఘునాథపల్లి తహసీల్దార్ ఫణికిశోర్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ , ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.





# పీహెచ్‌సీపీ పరిశీలించిన జనగామ డీఎంహెచ్‌వో

**పాలకుర్తి, మన చౌరాస్తా :** జనాగమ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. మల్లిఖార్జునరావు మంగళవారం పాలకుర్తిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశాలించారు. ఈ సందర్భంగా పాలకుర్తి పరిధిలోని వైద్యాధికారులు, ఎంఎల్ హెచ్‌పీ, పర్యవేక్షక సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలతో సమావేశమై అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ఆరోగ్య సూచికలపై విపులంగా సమీక్షించారు. అనంతరం ఆసుపత్రిలో చేరిన రోగులను ప్రత్యక్షంగా కలుసుకుని వారి ఆరోగ్య స్థితి, అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వారం రోజులలో పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాలలో ఫీవర్ సర్వేలను, మెడికల్ క్యాంపులను నిర్వహించాలన్నారు. అలాగే గర్భిణుల ఏఎన్‌సీ పరీక్షల శాతాన్ని పెంచి ఆన్‌లైన్ ఎంట్రీలను తప్పనిసరిగా పూర్తి చేయాలని, సాధారణ ప్రసవాలకు ప్రోత్సహించాలన్నారు. మందుల నిల్వలు ఎప్పటికప్పుడు సమీక్షించుకుని కావలిసిన మందులు ఇండెంట్ పెట్టుకోవాలని ఆదేశించారు.




# దళితులపై పెరుగుతున్న దౌర్జన్యాలు

**జనగామ, మన చౌరాస్తా :** బీజేపీ పాలిత రాష్ట్రాలలో దళితులపై రోజురోజుకి దౌర్జన్యాలు పెట్రేగిపోతున్నాయని ప్రత్యేకించి ఉత్తర ప్రదేశ్ లో గత పదకొండు ఏళ్ల కాలంలో 59 వేల దౌర్జన్యాలు జరిగాయని , బీజేపీ మనువాద మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల శేఖర్ పిలుపునిచ్చారు. మంగళ వారం జనగామ జిల్లా కేంద్రంలో కెవిపిఎస్ జిల్లా స్థాయి విస్తృత సమావేశం సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మబ్బు ఉప్పలయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోట్ల శేఖర్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత బిజెపి పాలిత రాష్ట్రాలైన ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్ ఘడ్, బీహార్, ఢిల్లీ రాష్ట్రాల్లో దళితులపై గంటకు 15 దౌర్జన్యాలు జరుగుతున్నాయని అన్నారు. రాజ్యాంగ బద్దంగా రూపొందించిన ఎన్నికల కమిషన్ ఈడి, సిబిఐ వంటి స్వతంత్ర సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుని ప్రతిపక్షాలపై కక్ష సాధింపులకు పాల్పడుతుందన్నారు. రాష్ట్రంలో కులగణన జరిగి 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును అన్ని రాజకీయ పార్టీలు సంపూర్ణంగా బలపరిస్తే కేవలం ఒక బీజేపీ మాత్రమే బీసీ బిల్లుకు వ్యతిరేకంగా నిలబడుతుందన్నారు. తక్షణమే బీసీ బిల్లుకు మద్దతు తెలియజేయాలని లేకపోతే ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పూటి దేవదానం, ఎండి హత్యా సుల్తానా, గడ్డం యాదగిరి, బొట్ల శ్రావణ్, కాకర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు మరమ్మతు చేపట్టాలని నిరసన

బచ్చన్నపేట, మన చౌరాస్తా : సంవత్సరాల తరబడి గుంతల మయమై ప్రమాదాలు జరుగుతున్న రోడ్డును మరమ్మతులు చేయడంలో సంబంధిత అధికారులు పూర్తిగా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని సిపిఎం జనగామ జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్ అన్నారు. మంగళవారం సిపిఎం బచ్చన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ నుండి కొడవటూరు కమాన్ వరకు గుంతల మయమైన రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ బచ్చన్నపేట మండల కేంద్రంలోని రోడ్డు యాదాద్రి భువనగిరి జిల్లా సిద్దిపేట జిల్లా జనగామ జిల్లాలను కలుపుతూ ఉన్న రోడ్డు పట్ల అధికారులు నిర్లక్ష్యం చేయడం సరైనది కాదన్నారు. ఈ రోడ్డు నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటూ పెద్ద పెద్ద భారీ వాహనాలు ఈ రోడ్డుపై నడుస్తాయని అట్టి వాహనాలు అనేక సందర్భాలలో బోల్తాపడి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం ఉన్నాయన్నారు. నిన్నటి రోజున వడ్ల లోడుతో వెళుతున్న భారీ వాహనం నడిరోడ్డుపై బోల్తా పడిందన్నారు. అలాగే అనేకమంది ప్రయాణికులు ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కింద పడి గాయాలపాలై ప్రాణాలు కోల్పోయిన ఘటనలు అనేకం జరిగాయన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున వర్షం ద్వారా



ఏర్పడిన గుంతలలో వర్షపు నీరు చేరి గుంతల లోతు తెలియక అనేకమంది ప్రమాదాలకు గురవుతున్నారని వెంటనే ధ్వంసమైన నేషనల్ హైవే రోడ్డుకు మరమ్మతులు చేపట్టి ప్రయాణికులను కాపాడాలని వారు కోరారు లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో రోడ్లను దిగ్బంధిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్, మండల నాయకులు రామగళ్ళ అశోక్ సమ్మయ్య మురళి శోభ సుధాకర్ మైబెల్లి భాస్కర్ కిష్టయ్య చారి మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.







# ప్రజలంతా జాగ్రత్తలు పాటించండి

- అత్యవసరం అయితేనే బయటికి రండి
- ఇబ్బందులు ఎదురైతే ఫోన్ చేయండి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




**జనగామ, మన చౌరాస్తా :** వచ్చే 3 రోజులు వాతావరణ శాఖ భారీ వర్షసూచన చేసిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తం గా ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం వివిధ శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, డీసీపీ రాజమహేంద్ర నాయక్ తో కలిసి కలెక్టర్ గూగుల్ మీటింగ్ ద్వారా గ్రామ స్థాయి నుండి అన్ని శాఖల అధికారులతో రివ్యూ చేసి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను అన్ని శాఖల అధికారులు తుచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ అన్నారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రతీ శాఖ అధికారులు వారి పరిధిలో గల విధులను బాధ్యత లను సజావుగా నిర్వర్తించాలన్నారు. ఎలాంటి నిర్లక్ష్యం వహించిన చర్యలు తప్పవన్నారు. కాజ్ వేల మీద ఎవ్వరు ప్రయాణం చేయకుండా చూడాలని, చెరువులు తెగే పరిస్థితి ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు హెడ్ క్వార్టర్ మెయింటైన్ చేయాలని వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పునరావాస కేంద్రాల ఏర్పాటు




చేయాలన్నారు. అన్ని సంక్షేమ హాస్టల్ లో విద్యార్థుల పట్ల జాగ్రత్త గా ఉండాలని, బయటకు రాకుండా చూడాలన్నారు. ప్రతీ శాఖ అధికారులు తమ పరిధిలో గల సిబ్బందితో వెంటనే సమావేశం పెట్టుకొని తగు ఆదేశాలు ఇవ్వాలన్నారు. మున్సిపల్ పరిధిలో కూడా కంట్రోల్ రూమ్ ని ఏర్పాటు చేసి ప్రజలకు కంట్రోల్ నెంబర్ ని తెలియపరచలన్నారు. అత్యవసర పరిస్థితులు ఎదురైన వెంటనే స్పందించేందుకు కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ 24/7 పనిచేస్తుందని కలెక్టర్ తెలిపారు. భారీ వర్షాల వల్ల వరదలు, ఇళ్లకు నష్టం, రహదారులు ధ్వంసం, చెట్లు కూలిపోవడం వంటి విపత్కర పరిస్థితులు ఎదురైన సందర్భంలో వెంటనే కంట్రోల్ రూమ్‌కు 9052308621 సమాచారం అందించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి, సమస్యలను తక్షణమే తెలియజేయలని..అధికారులు వెంటనే చర్యలు తీసుకుంటారన్నారు.

# ఊపిరి పోయాక కొడుకొచ్చాడు

## 'మన చౌరాస్తా' కథనానికి స్పందన

**కోహెడ, మన చౌరాస్తా :** కొనఊపిరితో కోమాలు తండ్రిని పట్టించుకోని కొడుకుపై మానవీయకోణంలో 'మన చౌరాస్తా' ఇచ్చిన కథనం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కోమాలో ఉన్న తండ్రిని చూసేందుకు ఆ కొడుకు బయలుదేరాడు. కోహెడ మండలం నకరికమ్ముల గ్రామానికి తన కొడుకు చేరుకునేసరికి దురదృష్టం వెంటాడిందో లేదా తన ప్రాణం తీసుకపోవాలని ఆ భగవంతున్ని ఆ తండ్రి కోరుకున్నాడో తెలియదు కానీ తన కుమారుడు రాకముందే తండ్రి కుమార్ ప్రాణం విడిచాడు. ఊపిరి ఉన్నంతవరకు రాని కుమారుడు ఊపిరి పోయాక వచ్చాడని ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. నేటి సమాజంలో మానవతా విలువలు తగ్గుతున్నాయని కళ్లకు కట్టినట్లుగా కథనాన్ని అందించిన 'మన చౌరస్తా' పత్రికకు ప్రజలు అభినందనలు తెలిపారు.


మన చౌరాస్తా 12.08.2025 Mana Chourasta 2

కొన ఊపిరితో కోమాలో తండ్రి..

తనకేం సంబంధం లేదంటున్న కొడుకు..



# ఘనంగా నల్ల పోచ్చమ్మ పలహారం బండి ఊరేగింపు

**బచ్చనపేట, మన చౌరస్తా :** మెట్టుగూడ పోతరాజు మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీమెట్టుగూడ నల్ల పోచమ్మ తల్లి పలహారం బండి ఊరేగింపు జాతర కార్యక్రమానికి బచ్చన్నపేట మండల యువ నాయకులు అఖిల్ మాల, చెవుల రాజేష్, గద్ద శ్రీకాంత్ హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక మొక్కలు చెల్లించుకున్నారు. నల్ల పోచమ్మ ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర ప్రజలు రైతులు పాడిపంటలతో సుఖసంతోషాలతో ఉండాలని వారు కోరుకున్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్రంలో ఎంతోమంది యువతకు ఆదర్శంగా నిలుస్తు సుపరిచితుడైన మెట్టుగూడ పోతరాజు మహేష్ తో కలిసి జాతరలో సందడి చేశారు.

# రేణుక ఎల్లమ్మకు పసుపు కొమ్ముల అలంకరణ



**జనగామ, మన చౌరాస్తా :** బాలాజీ నగర్ మూడో వార్డు పరిధిలో ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి పసుపు కొమ్ముల అలంకరణ రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. శ్రావణమాసం మంగళవారం స్త్రీలకు చాలా ముఖ్యమైనది. ఈ మాసంలో అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించడం అనేది శుభ్రత, ఆరోగ్యం, ఆనందం శ్రేయస్సును కోరుతూ చేసే ఆచారం ఇలా దర్శించుకోవడం ద్వారా భక్తులు తమ కష్టాలు తొలగిపోయి సుఖశాంతులు, అష్ట ఐశ్వర్యాలు పొందుతారని నమ్ముతారు. పసుపు కొమ్ములతో చేసిన తోరణాలను అమ్మవారి విగ్రహాన్ని చుట్టుకట్టి అలంకరించారు. ఆలయ అర్చకుడు మారుపాక శ్యాం ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు హాజరై ప్రత్యేకమైన కుంకుమార్చనలు పూజలు చేశారు.

